



రేపు డయల్ యువర్ ఈవో

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

డయల్ యువర్ ఈవో కార్యక్రమం సెప్టెంబరు 6వ తేదీ శుక్రవారం మధ్యాహ్నం 2 నుండి 2.50 గంటల వరకు తిరుమల అన్నమయ్య భవనంలో జరగనుంది. ఈ కార్యక్రమాన్ని శ్రీ వేంకటేశ్వర భక్తి ఛానల్ ప్రత్యక్ష ప్రసారం చేస్తుంది. ఈ కార్యక్రమంలో భక్తులు తమ సందేహాలను, సూచనలను టిటిడి ఈవో జె.శ్యామలరావుకు ఫోన్ ద్వారా నేరుగా మాట్లాడి తెలుపవచ్చు. ఇందుకు భక్తులు సంప్రదించవలసిన నెంబరు 0877-2263261.



'గురువు'కు వందనం

- నేడే ఉపాధ్యాయ దినోత్సవం
- 68 మందికి అవార్డుల ప్రదానం

ప్రజాశక్తి - తిరుపతి

సమాజాన్ని అభివృద్ధికర దిశగా మార్చగల శక్తి ఉపాధ్యాయులకే ఉంది.. విద్యార్థుల భవిష్యత్తుకు పునాదులు వేసి, వారి జీవితాల్లో వెలుగులు నింపగలిగిన ఉపాధ్యాయుల జన్మ ధన్యమైనట్లే.. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి పురస్కరించుకుని ప్రతి ఏటా ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేస్తోంది. ఈ ఏడాది తిరుపతి జిల్లాలో 68 మంది ఉపాధ్యాయులకు అవార్డులను ప్రదానం చేసింది. గురువారం కలెక్టర్ చేతుల మీదుగా అవార్డుల ప్రదానం జరగనుంది.

తిరుపతి జిల్లాలో విశేష ప్రతిభ కనబరిచిన 68 మంది ఉపాధ్యాయులను జిల్లా విద్యాశాఖ అవార్డులకు ఎంపిక చేసింది. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గురువారం జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఈ అవార్డులను ప్రదానం చేయనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి వి శేఖర్ పేర్కొన్నారు. తిరుపతి అర్బన్‌లో ఎస్.మురళీమోహన్ ప్రసాద్, పి.మురళీకృష్ణయ్య, జి.దేవరాజు నాయుడు, డి.నిర్మల ఎంపిక కాగా, తిరుపతి రూరల్ మండలంలో డి.ప్రశాంతి, కె నాగేశ్వరయ్య, కె జానకి రామ మండది, బి నాగమల్లేశ్వరి ఎంపికయ్యారు. జిల్లాలో అత్యధికంగా పుత్తూరు మండలంలో ఆరుగురు ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. పుత్తూరులో పిఎస్ సుబ్బరాయన్, భువనేశ్వరి, ఎం గోపి, బి హరినాథ్, ఎ గోపికృష్ణ, ఎ కేశవులు అవార్డులకు ఎంపికయ్యారు. చంద్రగిరి మండలంలో బి రామ్మూర్తి, డాక్టర్ ఎ భారతమ్మ, వి లావణ్య లత, బి మల్లీశ్వరి ఎంపికయ్యారు. తిరుపతి జిల్లాలోని 31 మండలాలకు గాను 68 మంది ఉపాధ్యాయులు ఉత్తమ టీచర్లుగా ఎంపిక కావడం పట్ల పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాల నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కందాటి మునీశ్వర్ రెడ్డికి...



తిరుపతి జిల్లా తొట్టంబేడు మండలం గుండేలగుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కందాటి మునీశ్వర్ రెడ్డికి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు దక్కింది. మునీశ్వర్ రెడ్డి గత 24 సంవత్సరాలుగా ఎంతో మంది విద్యార్థులను, వెనుకబడిన తరగతుల వర్గాల పిల్లలను చేరదీసి ఉత్తమ బోధన చేశారు. కెరీర్ గైడెన్స్ ఇవ్వడం ద్వారా ఎంతో మంది విద్యార్థులు మంచి ఉద్యోగాల్లో స్థిర పడేలా చేశారు.

సాంఘిక..సామాజికం నా రెండు కళ్ళు
జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడు సురేష్

సాంఘిక..సామాజికం నా రెండు కళ్లని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైన కూనాటి సురేష్ అన్నారు. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి మండలం ఊరందూరు ఉన్నత పాఠశాలలో సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న సురేష్‌కు కేంద్ర ప్రభుత్వం జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక చేసిన సంగతి తెలిసిందే. నేడు ఆయన ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్ లో రాష్ట్రపతి చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డును అందుకోనున్నారు. ఈ సందర్భంగా తనను ప్రజాశక్తి పలకరించగా సాంఘిక శాస్త్రం పై తనకున్న మక్కువను వివరించారు. పాఠ్యాంశాల బోధనతో పాటు విద్యార్థులకు దారిచేసే సేవా కార్యక్రమాలను సమాంతరంగా నిర్వర్తించడంతో తనకీ అవార్డు దక్కిందని తెలిపారు. ఆ తపన ఉపాధ్యాయ వృత్తితోపాటు సామాజికపరంగా ప్రత్యేక గుర్తింపు వచ్చేలా చేసిందన్నారు.

ఉపాధ్యాయులకు సత్కారం

పుత్తూరు టౌన్ : భావితరాలను తీర్చిదిద్దే బృహత్తర బాధ్యత గురువులపైనే ఉందని ఎంఎల్ఎ గాలి భానుప్రకాష్ అన్నారు. వివిఎన్ కళ్యాణ మండపం నందు రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన గురుబ్రహ్మ జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలను అందించే కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా విచ్చేశారు. నగరి నియోజకవర్గంలో ఉత్తమ సేవలందించినటువంటి ఉపాధ్యాయులను గుర్తించి వారికి గురుబ్రహ్మ జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలను సంస్థ చైర్మన్ డాక్టర్ రమేష్ నాథ్ లింగుట్ల, సమన్వయకర్త డాక్టర్ మొర్రిమేకల దేవరాజులు ఆధ్వర్యంలో అందజేశారు. ఈ కార్యక్రమం లో జిల్లా విద్యాశాఖాధికారి శేఖర్, పాల్గొన్నారు.

పి.సునీత, సి.రమేష్ యాదవ్





రామచంద్రాపురం : ఆర్ సి పురం నుండి పి.సునీత, సి. రమేష్ యాదవులు ఎంపికయ్యారు. ఎన్ ఆర్ కమ్మపల్లి గ్రామంలోని మండల ప్రజా పరిషత్ స్కూల్ నందు ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్న పి సునీత, పరమాల జిల్లా పరిషత్ హై స్కూల్ నందు స్కూల్ అసిస్టెంట్ హిందీ పండిట్ ఉపాధ్యాయుడు రమేష్ యాదవులు ఎంపికయ్యారు.

ఉదయ్ సపోర్ట్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో...

స్థానిక న్యూ బాలాజీ కాలనీలోని మేక్ మై బేబీ జీనియస్ స్కూల్ నందు బుధవారం ఉదయం ఉదయ్ సపోర్ట్ చారిటబుల్ ట్రస్ట్ రేవతి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఫౌండర్ ప్రెసిడెంట్, చైర్మన్ తహసున్నీస అధ్యక్షతన అత్యంత ఘనంగా జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తిరుపతి డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి కె బాలాజీ, అతిథులుగా డైరెక్టర్ మేక్ మై బేబీ జీనియస్ స్కూల్ ఎస్ భాస్కర్ రాజు, ప్రసన్న భారతి విద్యాసంస్థల అధినేత కె ఈశ్వరయ్య, వేదపాఠశాల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి సి నారాయణస్వామి, వెల్‌నెస్ సిటీ అండ్ ఐఐటీ అకాడమీ డైరెక్టర్ జి వీరశేఖర్, సి మహమ్మద్ ఖాన్ తదితరులు హాజరయ్యారు. 42 మంది ఉపాధ్యాయులకు బెస్ట్ టీచర్స్ అవార్డ్స్ అందించారు.





విరాళాల సేకరణలో సిహెచ్ నర్సింగరావు



'మా వంతు' సాయం..!

ముంపు బాధితులకు అండగా..

- సిఐటియు విరాళాల సేకరణ
- కదిలిన ప్రజాసంఘాల శ్రేణులు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

వరద బాధితులకు సాయం అందించేందుకు ప్రతి ఒక్కరూ స్పందిస్తున్నారు. కొంతమంది డైరెక్టుగా ఆయా ప్రాంతాలకు వెళ్లి తమవంతు సాయం అందిస్తుంటే, అక్కడకు వెళ్లలేని వారు తమవంతు సాయంగా ఆర్థిక సాయం అందిస్తున్నారు. బుధవారం సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు ఆధ్వర్యంలో శ్రేణులు కదిలాయి. శ్రీవారి మెట్టు వ్యాపారుల యూనియన్ ఆధ్వర్యంలో సహాయ నిధిని సేకరించారు. తిరుమల తిరుపతి దేవస్థానం పరిపాలనా భవనం వద్ద నుండి భవానీనగర్ సర్కిల్ మీదుగా తీర్థకట్ట, గాంధీరోడ్డు వరకూ షాపుల వద్ద తిరిగి నిధి వసూలు చేశారు. కొన్ని గంటల్లోనే వసూలైన 25వేల రూపాయల నిధిని రాష్ట్ర కేంద్రానికి పంపించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శి జి.బాలసుబ్రమణ్యం, కందారపు మురళి, నాయకులు ఎస్.జయచంద్ర, ఆర్.లక్ష్మి, టి.సుబ్రమణ్యం, వేణుగోపాల్, బుజ్జి, తంజావూరు మురళి, శ్రీవారి మెట్టు వ్యాపారస్తుల సంఘం నాయకులు యుగంధర్, మధు, చిట్టిబాబు, గిరిధర్, మల్లికార్జున పాల్గొన్నారు.

విజయవాడకు తరలివెళ్లిన కమిషనర్లు

వరద ముంపు ప్రాంతాల్లో సహాయ చర్యలు చేపట్టేందుకు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఉన్న మున్సిపల్ కమిషనర్లు, ఇంజనీరింగ్ పారిశుద్ధ్య విభాగానికి చెందిన కార్మికులు విజయవాడకు పయనమయ్యారు. ఇంజినీరింగ్ విభాగంలో డిఇలు, ఎఇలు, పారిశుధ్య విభాగంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మేస్త్రీలు తరలి వెళ్లారు.

శ్రీషిరిడి సాయిబాబా మందిర కమిటీ సాయం

గూడూరు పట్టణంలోని శ్రీ షిరిడి సాయిబాబా మందిర కమిటీ లక్ష రూపాయలను, చార్టెడ్ అకౌంటెంట్ కంతి రామ్మోహన్‌రావు 50వేలు, రోటరీక్లబ్ 50వేలు కలిపి మొత్తం రెండు లక్షల రూపాయల ఆర్థిక సాయాన్ని ఎంఎల్ఎ పాశం సునీల్‌కుమార్‌కు దాతలు అందజేశారు.

రాజధానికి తరలిన ఎస్ఎఫ్ఐ శ్రేణులు

వరదల్లో చిక్కుకుని అవస్థలు పడుతున్న వారికి అండగా నిలుద్దాం అంటూ ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు విజయవాడ వరద బాధితుల సహాయ కార్యక్రమాల్లో పాల్గొనడానికి తిరుపతి జిల్లా కార్యదర్శి భగత్ రవి, జిల్లా ఉపాధ్యక్షులు బాల, నాయకులు గణేష్, హర్షద్, బ్రహ్మం తరలి వెళ్లారు. బుధవారం సాయంత్రం పద్మావతి ఎక్స్‌ప్రెస్‌లో బయల్దేరి వెళ్లారు. చదువు పోరాటాలతో పాటు, విపత్తు సమయంలో వాలంటీర్ సాయం అందించడం తమ బాధ్యతని భగత్‌రవి తెలిపారు.

రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

మానవసేవే మాధవసేవంటూ విజయవాడ సింగ్‌నగర్, చిట్టినగర్‌వాసులకు రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ ఛైర్మన్ డాక్టర్ రమేష్‌నాథ్ లింగుట్ల ఆధ్వర్యంలో సాయం అందించారు. తమ సేవా సంస్థ ప్రతినిధులైన డాక్టర్ మొర్రి మేకల దేవరాజులు, శవన్నగారి బాలాజీ, డాక్టర్ పైడి అంకయ్య, బాషా తదితరులు దాదాపు రెండు లక్షల రూపాయల విలువైన ఆహార పొట్లాలు, మంచినీళ్ల బాటిళ్లు, బిస్కెట్ ప్యాకెట్లు, పాల ప్యాకెట్లు, రొట్టెలు అందించారు.

భక్తులకు టిటిడి తీపి కబురు

విజయవాడ, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా తిరుమల శ్రీవారి దర్శనానికి విచ్చేసే భక్తుల సంఖ్య గణనీయంగా తగ్గిందని ఈవో శ్యామలరావు తెలిపారు. భక్తుల విజ్ఞప్తి మేరకు టీటీడీ స్థానిక ఆలయాలు, సమాచార కేంద్రాలలో శ్రీవారి లడ్డూ ప్రసాదాలను విక్రయిస్తున్నట్లు చెప్పారు. సెప్టెంబర్ 2వ తేదీ 50 వేలు, సెప్టెంబర్ 3వ తేదీ 13 వేలు, సెప్టెంబర్ 4వ తేదీ 9,500 లడ్డూలు విక్రయించినట్లు ఈవో తెలిపారు.

విజయవాడలో తిరుపతి డిస్కం సేవలు : సిఎండి

భారీ వర్షాల కారణంగా విజయవాడలో అతలాకుతలమైన విద్యుత్ వ్యవస్థను సరిదిద్దేందుకు విద్యుత్ సంస్థల అధికారులు, సిబ్బంది రేయింబవళ్ళు శ్రమిస్తున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఇంధన శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ ఆదేశాలకు అనుగుణంగా విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులను వేగవంతం చేస్తున్నారు. విజయవాడ పట్టణ పరిధిలో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనుల పర్యవేక్షణ బాధ్యతలను ఎపిఎస్ పిడిసిఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె. సంతోష రావుకు అప్పగించారు. ఎపిఎస్ పిడిసిఎల్ నుంచి 65 బందాల ద్వారా మొత్తం 810 మంది అధికారులు, సిబ్బంది ఈ పునరుద్ధరణ పనుల్లో పాల్గొంటున్నారు.

కాళంగి రిజర్వాయర్ పరిశీలించిన కలెక్టర్

కాళంగి రిజర్వాయర్‌ను ఇరిగేషన్ అధికారులు, రైతులతో కలిసి కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ బుధవారం పరిశీలించారు. రిజర్వాయర్ గేట్ మరమ్మతు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. తెలుగుగంగ ఎస్ఇ మదన్‌గోపాల్‌తో కలిసి అక్కడి రైతులతో మాట్లాడారు. తెలుగు గంగ కెనాల్ నీరు తిరుపతి పట్టణానికి అందించే ఆఫ్ టేక్ పాయింట్ ను, కోకో కోలా కంపెనీ కి నీరు అందించేందుకు చేపడుతున్న ఆఫ్ టేక్ పాయింట్ ను కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీకాళహస్తి రవి శంకర్ రెడ్డి, డీఈ ఆదినారాయణ, తహశీల్దార్ దస్తగిరయ్య పాల్గొన్నారు.

బర్డ్‌లో అత్యున్నత వైద్యప్రమాణాలు : ఈవో

తిరుపతి సిటీ : బర్డ్ ఆసుపత్రిలో అత్యున్నత వైద్య ప్రమాణాలు అమలవుతున్నాయని, దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుండి ఆర్థోపెడిక్స్ సంబంధిత సమస్యలతో ఇబ్బంది పడుతున్న రోగులు ఇక్కడికి విచ్చేసి మెరుగైన చికిత్సలు పొందాలని టీటీడీ ఈవో ఈవో జె.శ్యామలరావు చెప్పారు. బుధవారం ఈవో అధికారులతో కలిసి బర్డ్ ఆసుపత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ బర్డ్ ఆసుపత్రిలో కార్పొరేట్ ఆసుపత్రుల స్థాయిలో వైద్య చికిత్సలు అందిస్తున్నట్లు చెప్పారు. రోగులకు ఓపి, ఆపరేషన్లు, కృత్రిమ అవయవాల అమరిక వేగవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఈవోలు గౌతమి, వీరబ్రహ్మం, సిఈ సత్యనారాయణ పాల్గొన్నారు.



మీ కళాశాలకు మీరే అతిథి కావాలి

ఎన్నారై ఫ్రెషర్స్ డే లో లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

ఎన్ఆర్ఐ జూనియర్ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలు, ముందస్తుగా ఉపాధ్యాయ దినోత్సవ సంబరాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక మహతి ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమానికి సిఐడి మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుకున్న స్కూల్లో కళాశాలల్లో భవిష్యత్తులో జరిగే కార్యక్రమంలో మీరు ముఖ్య అతిథులుగా వచ్చే విధంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆ కళాశాల డైరెక్టర్ భాస్కరరావు, సీఈవో జుపిటర్ ప్రసాద్ రావు పాల్గొన్నారు.

తిరుపతి తలమానికంగా రైల్వేస్టేషన్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి ఎంపీ డాక్టర్. మద్దిల గురుమూర్తి బుధవారం రైల్వే స్టేషన్ అభివద్ధి పనులను పరిశీలించారు. రైల్వే స్టేషన్ డైరెక్టర్, ఇంజనీరింగ్ అధికారులు స్టేషన్ నిర్మాణ పనుల గూర్చి ఎంపీకి వివరించారు. అనంతరం నిర్వహించిన సమీక్షా సమావేశంలో స్టేషన్ నిర్మాణాల పురోగతి, రైల్వే అండర్ బ్రిడ్జిలు, ఫుట్ ఓవర్ బ్రిడ్జిల గురించి రైల్వే ఇంజనీరింగ్ విభాగం వారు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. తిరుపతి రైల్వే స్టేషన్ ద్వారా సంవత్సరానికి సుమారు 6 కోట్ల మంది ప్రయాణిస్తున్నారని వారందరికీ అనుకూలంగా ఉండే విధంగా అంతర్జాతీయ ప్రమాణాలతో రూ.300 కోట్లతో అభివద్ధి చేస్తున్నామని ఆయన అన్నారు. గూడూరు తిరుపతి మూడవ రైల్వే లైన్ శాంక్షన్ అయ్యిందని ఈ సందర్భంగా ఎంపీ తెలియజేసారు. పూడి, ఏర్పేడు రైల్వే లైన్ నిర్మాణం కోసం త్వరితగతిన భూసేకరణ చేస్తామన్నారు.

'యద్ధనపూడి' సాహిత్యంపై పరిశోధన సాగాలి

ప్రజాశక్తి - క్యాంపస్

యద్దనపూడి సులోచనారాణి రచనలపై సమగ్ర పరిశోధన సాగాలని వక్తలు ఆకాంక్షించారు. ఎస్వీయూ తెలుగు విభాగం - ఓఆర్ఐ విభాగం సంయుక్తంగా యద్దనపూడి సులోచన రాణి సాహిత్య వివేచన పుస్తక పరిచయ సభను బుధవారం నిర్వహించారు. ఆర్ట్స్ బ్లాక్ ఆడిటోరియంలో నిర్వహించిన ఈ సభకు ఆకాశవాణి మాజీ సంచాలకులు డాక్టర్ నాగసూరి వేణుగోపాల్, ఎస్వీయూ ఇన్ చార్జి వీసీ ఆచార్య బీవీ అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు, మాజీ మంత్రి, రచయిత్రి గల్లా అరుణకుమారి, ఆంధ్రజ్యోతి అసిస్టెంట్ ఎడిటర్ డాక్టర్ ఆర్ ఎం ఉమామహేశ్వరరావు, తెలుగు విభాగాధిపతి ఆచార్య రాజేశ్వరమ్మ, ఓఆర్ఐ డైరెక్టర్ ఆచార్య వీసీ వెంకటేశ్వర్లు పాల్గొని ప్రసంగించారు. ఎస్వీయూ ఇన్చార్జి వీసీ ఆచార్య అప్పారావు మాట్లాడుతూ సమాజాన్ని మార్చే శక్తి సాహిత్యానికి ఉందన్నారు. తెలుగు సమాజాన్ని



చాలా గొప్పగా ప్రభావితం చేసిన రచయిత్రి యద్దనపూడి సులోచనారాణి అని కొనియాడారు. రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు మాట్లాడుతూ కుటుంబ సంబంధాలను మానవ సంబంధాలను ప్రత్యేకించి స్త్రీ, పురుష సంబంధాలను ఉన్నతీకరించిన ప్రత్యేకత యద్దనపూడి సులోచనారాణి సాహిత్యానికి ఉందని అభిప్రాయపడ్డారు. అతిథులను వర్సిటీ ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపల్ ఆచార్య పద్మనాభం సన్మానించారు. ఈ కార్యక్రమంలో తెలుగు అధ్యాపకులు సునీల్ కుమార్, బ్రహ్మానందరెడ్డి, అశోక్, ఆదిశేషయ్య, పెంచల ప్రసాద్ పాల్గొన్నారు.

మా జీతాలకు జీఎస్టీ ఏంటి?

అటవీశాఖ అవుట్సోర్సింగ్ సిబ్బంది ఆవేదన

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

అడవిలో వక్షాలను, జంతువులను సంరక్షిస్తూ ఎర్రచందనం స్మగ్లర్ల బారి నుండి అడవిని కాపాడే మాకు జీతాలు లేక జీవితాలు చిద్రమవుతున్నాయని తిరుపతి జిల్లా పరిధిలో అటవీ శాఖలో పనిచేసే ఔట్సోర్సింగ్ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం తిరుపతి నగర పరిధిలోని కపిలతీర్థం వద్ద గల అటవీశాఖ జిల్లా అధికారి కార్యాలయం వద్ద అటవీశాఖ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అటవీ శాఖకు చెందిన వివిధ విభాగాలలో తిరుపతి జిల్లా పరిధిలో 350 మంది అహర్నిశలు పనిచేస్తున్నామన్నారు. అహర్నిశలు పనిచేసే తమకు సకాలంలో జీతాలు ఇవ్వక, ఉద్యోగ భద్రత కరువు అయ్యిందన్నారు. ఏజెన్సీ ద్వారా తమకు చెల్లిస్తున్న జీతాలకు జీఎస్టీ కట్ చేస్తున్నారని, అడవిని రక్షించడానికి సేవ చేసే తమకు ఇచ్చే జీతంలో జిఎస్టి కట్ చేయడం ఏమిటో అర్థం



కావడం లేదన్నారు. మేము ఏమైనా వస్తువులా కనబడుతున్నామా అంటూ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. వృక్షో రక్షితి రక్షిత్త అనే నినాదంతో అడవుల్లో విధులు నిర్వహిస్తున్నామని, చాలీచాలని జీతంతో కుటుంబాలను నెట్టుకొస్తున్నామన్నారు. ఔట్సోర్సింగ్ ఉద్యోగి ఖాతాల్లోకి నేరుగా నెలవారీ జీతం వచ్చేలా, ఉద్యోగ భద్రత కల్పించేలా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ దష్టికి తమ సమస్యను తీసుకొని వెళతామన్నారు.

'అమరరాజా'కు బెస్ట్ అవార్డు

ప్రజాశక్తి - రేణిగుంట

అమర రాజా స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ బెస్ట్ ఎంప్లాయిబిలిటీ ఇనిషియేటివ్ అవార్డు ను అందుకున్నారు. బెంగళూరులోని క్యాపిటల్ హెటల్లో జరిగిన నేషనల్ ఎక్సెన్స్ అవార్డు-2024 కార్యక్రమం జరిగింది. నైపుణ్యాలు జ్ఞానంతో వ్యక్తులకు సాధికారత కల్పించడంలో, మెరుగైన జీవనోపాధి అవకాశాలను అందిస్తున్నందుకు ఈ అవార్డును అందించి గౌరవించింది. అమరరాజా స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ద్వారా ఇప్పటివరకు దాదాపు 2వేలమంది నిరుద్యోగ యువతీ యువకులకు వివిధ విభాగాలలో నైపుణ్యాభివద్ధి చేయడమే కాకుండా వారికి అమర రాజా సంస్థలో ఉద్యోగ అవకాశాలు కల్పించారు. రాజన్న ఫౌండేషన్ ఫౌండర్ గల్లా రామచంద్ర నాయుడు మాట్లాడుతూ అమర రాజా స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఈ అవార్డును అందుకోవడం తమకు సంతోషంగా ఉందన్నారు. ఈ అవార్డును మిస్టర్ జుంటే జంగ్, డైరెక్టర్, జియోంగ్గీ బిజినెస్ సెంటర్ (రిపబ్లిక్ ఆఫ్ కొరియా), యాషి ధరివాల్, బెంగళూరులోని కంబోడియా గౌరవ కాన్సులేట్, పొలిటికల్ అండ్ ఎకనామిక్ డిపార్ట్మెంట్ హెడ్ చేతులమీదుగా అమర రాజా స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ డీన్ - కె. రవికుమార్, రాజన్న ఫౌండేషన్ హెడ్ సతీష్ రాళ్ళపల్లి అందుకున్నారు.



విద్యుత్ కార్మికుల ముట్టడి వాయిదా : సిఐటియు

ప్రజాశక్తి - తిరుపతి సిటి

ఈనెల 5వ తేదీ గురువారం రాష్ట్రంలోని డిస్కాం కార్యాలయాల ఎదురుగా విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు తలపెట్టిన ముట్టడి కార్యక్రమాలను, రాష్ట్రంలో నెలకొని ఉన్న వరద పరిస్థితుల దష్ట్యా వాయిదా వేస్తున్నామని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు ప్రకటించారు. తిరుపతి నగరంలో ఈనెల రెండవ తేదీ నుంచి నిరాహార దీక్షలు నిర్వహిస్తున్న షిఫ్ట్ ఆపరేటర్లను ఉద్దేశించి ఆయన బుధవారం ప్రసంగించారు. అంతకుముందు ఎస్పీడీసీఎల్ సిజిఎం హెచ్ఆర్డి రమాదేవితో పలు అంశాలపై సిహెచ్ నర్సింగరావు, యునైటెడ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు సూరిబాబు, సుమన్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు శివప్రసాద్ రెడ్డి, శ్రీనివాసులు, కుమార్ తదితరులు చర్చల్లో పాల్గొన్నారు.

గురుకులాల్లో డ్రైనేజి వ్యవస్థ మెరుగుపడాలి : కలెక్టర్

ప్రజాశక్తి - సూళ్లూరుపేట, తడ

సూళ్లూరుపేట లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలను తనిఖీ చేసి విద్యా బోధన బాగుందని, విద్యార్థినులు శ్రద్ధగా చదవాలని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ సూచించారు. పారిశుధ్యం మెరుగుపడాలని, డ్రైనేజీ సక్రమంగా ఉండేలా, రక్షిత త్రాగు నీటికి ప్రత్యామ్నాయం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోనే అత్యధిక విద్యార్థినులు కలిగి ఇంటర్మీడియట్ వరకూ 1050 మంది విద్యార్థినులు ఉన్నారన్నారు. గత ఏడాది 98 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. ఈసారి వందశాతం సాధించేలా ప్రణాళికాబద్ధంగా ప్రయత్నించాలన్నారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనాన్ని విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. ప్రస్తుతం ఉన్న రక్షిత తాగునీటికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రేచల్ వాణి, సూళ్లూరుపేట ఆర్‌డిఒ కార్యాలయ డిఎఒ రవికుమార్ పాల్గొన్నారు.


గురుకుల విద్యార్థులతో కలెక్టర్

ఇంటింటి సర్వే వివరాలు అప్డేట్ చేయాలి

ఫోటో ఎలక్టోరల్ జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ 2025 కొరకు బిఎల్ఓ లు తప్పనిసరిగా వారి పరిధిలోని ఇంటింటి గహ సందర్శన చేసి సర్వే బాధ్యతగా చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. బుధవారం ఉదయం సూళ్లూరుపేట నియోజక వర్గ పరిధిలోని దొరవారిసత్రం మండలం నెలబల్లి గ్రామం హరిజనవాడ, తడ మండలం కాదలూరు గ్రామం, తడ కండ్రిగ నందు బిఎల్ఓ లు చేపడుతున్న ఫోటో ఎలక్టోరల్ జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ 2025 ఇంటింటి సర్వేను జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేసి పరిశీలించారు. దొరవారి సత్రం తహశీల్దార్ శైలకుమారి, ఎంపిడిఓ రాఘవేంద్ర, డిఎల్ డిఓ శేషయ్య, పీడిటి పవన్ పాల్గొన్నారు.


శ్రీవారి లడ్డుపై ఆంక్షలు

- 'ఆధార్'కు రెండే పరిమితం
- సామాన్య భక్తుల్లో తీవ్ర విముఖత
- దళారుల దందాకు ఊతమిచ్చినట్లే: ప్రతిపక్షాలు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

భక్తుల రద్దీ సమయంలో దర్శనం చేసుకోలేని సామాన్య భక్తులు అఖిలాండం వద్ద కర్పూరం వెలిగించి, టెంకాయ కొట్టి, దండం పెట్టుకుని,కౌంటర్లో ఒక్కో లడ్డు 50 చొప్పున కావల్సినన్ని కొనుక్కుని ఇళ్లకు తీసుకెళ్లి చుట్టుపక్కలవారికి పంచుకునేవారు. అయితే శ్రీవారి లడ్లును పెళ్లిళ్లకు, పుట్టినరోజులకు, ఇతరత్రా శుభకార్యాలకు పంచుతున్నారని సాకుగా చూపి టిటిడి శ్రీవారి లడ్డుపై ఆంక్షలు విధించింది.

శ్రీవారి లడ్లును కోరినన్ని ఇచ్చేలా 2012లో నిర్ణయం తీసుకుంది. తిరుమలలోనే కాకుండా, తిరుపతి, శ్రీవారి అనుబంధ ఆలయాలు ఉన్న చెన్నయ్, బెంగుళూరు, విజయవాడ, ఢిల్లీ నగరాల్లోని టిటిడి సమాచార కేంద్రాల వద్ద లడ్డూల విక్రయాలు చేపడతామని వెల్లడించింది. ఈ నిర్ణయం సామాన్యులకు తీపి కబురును అందించినట్లయ్యింది. 2012కు ముందు తిరుమలలో రూ.25కే సబ్సిడీ కింద అందజేసేవారు. ఓ లడ్డు తయారీకి 38 రూపాయలు పడుతుందని, సబ్సిడీతో ఇవ్వడం వల్ల 13రూపాయలు అదనంగా భరించాల్సి ఉన్నందున రూ.50 రూపాయలు పెంచింది. దీంతో ఒక్కో లడ్డుపై 12 రూపాయలు లాభం పెట్టుకుని, భక్తులు ఎన్ని కోరితే అన్ని లడ్డూలు ఇవ్వాలని నిర్ణయం తీసుకుంది. తిరుమల లడ్డూ కౌంటర్‌లో 48 నుంచి 62 వరకూ ఓ భక్తునికి క్యూలైన్‌లో నిల్చుంటే ఆధార్, శ్రీవారి దర్శనంతో సంబంధం లేకుండా అడిగినన్ని లడ్డూలు ఇచ్చేవారు. అప్పట్లో రోజుకు లక్ష నుంచి లక్షా 50వేల వరకూ లడ్డూలను విక్రయించేవారు. అడిగినన్ని లడ్డూలు ఇవ్వాలన్న నిర్ణయంతో 3.50 లక్షల నుంచి 4.50 లక్షల లడ్డూల విక్రయం పెరిగింది. ఈ మేరకు టిటిడి సరాసరి ఐదు లక్షల లడ్డూలను భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని శ్రీవారి పోటులో తయారు చేసేవారు. కరోనా తరువాత ఆంక్షలు ఎత్తివేసిన మొదట్లో దర్శనంపై ఆంక్షలు పెట్టారు. అతి తక్కువమందికే దర్శనం పరిమితం చేయడంతో, దర్శనం చేసుకోలేనివారు మొక్కు తీర్చుకుని, అఖిలాండం వద్ద టెంకాయ కొట్టి, కర్పూరం వెలిగించి, లడ్డూ కౌంటర్‌లో కావాల్సినన్ని లడ్డూలను 50 రూపాయల చొప్పున కొనుగోలు చేసి బంధువులకు, చుట్టుపక్కలవారికి పంచిపెట్టేవారు. గత 12 ఏళ్లుగా ఇదే రీతిన జరుగుతోంది. అయితే అధికార పార్టీ ప్రజాప్రతినిధులు కొంతమంది మెహర్బానీ కోసం పెళ్లిళ్లు, పుట్టినరోజుల్లాంటి శుభకార్యాలకు పెద్దమొత్తంలో లడ్డూలను తీసుకెళ్లేవారు. ఈ విధంగా చేయడం వల్ల 'లడ్డు' పవిత్రత దెబ్బతింటుందన్న సాకుతో తాజాగా ఈవో శ్యామలరావు లడ్డూ



విక్రయాలపై ఆంక్షలు పెట్టారు. ఇకపై లడ్డు కావాలంటే 'ఆధార్' తప్పనిసరి. అంతేకాకుండా ఒక్కో ఆధార్‌కు రెండు లడ్డూలనే పరిమితం చేశారు. దీంతో పలు రాజకీయ పార్టీల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. భారీ మొత్తంలో లడ్డూల విక్రయాన్ని కట్టడి చేయకుండా, సామాన్యులు తీసుకునే లడ్డూలపై ఆంక్షలు ఏమిటంటూ ప్రశ్నిస్తున్నారు.

శ్రీవారి దర్శనం చేసుకుంటే 'అపరిమితం' : ఈవో

టిటిడి లడ్డు విక్రయంపై ఆంక్షలు విధించడంతో పెద్దఎత్తున విమర్శలు రావడంతో టిటిడి స్పందించింది. ఈవో శ్యామలరావు రెండు రోజుల క్రితం మీడియా సమావేశం ఏర్పాటు చేసి శ్రీవారి దర్శనం చేసుకున్న భక్తులకు టోకెన్ చూపించి కావాల్సినన్ని లడ్డూలు తీసుకోవచ్చని, దర్శనం చేసుకోని వారికి మాత్రం ఆధార్‌కు రెండు లడ్డూలనే పరిమితం చేశామని స్పష్టం చేశారు.

ఆంక్షలు ఎత్తివేయాలి : ప్రతిపక్షాలు

శ్రీవారి లడ్డూల విషయంలో టిటిడి తీసుకున్న ఆంక్షలు ఎత్తివేయాలని పలు రాజకీయ పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి. సిపిఎం, సిపిఐ, బిజెపి, వైసిపి నాయకులు వేర్వేరుగా ప్రకటనల్లో స్పందించారు. తిరుమల లడ్డూలపై ఆంక్షలు విధిస్తూ చేసిన ప్రకటన సామాన్య భక్తులకు శ్రీవారి లడ్డూను దూరం చేసేందుకేనని అన్నారు. ఎవరో పెళ్లిళ్లలో శ్రీవారి లడ్డూలు పంచారని, దాన్ని సాకుగా చూపి సామాన్య భక్తులకు కావాల్సినన్ని లడ్డూలు ఇవ్వకుండా అడ్డుకోవడం మంచి పద్ధతి కాదన్నారు. లడ్డూలపై ఆంక్షలు పెట్టడం వల్ల 50 రూపాయలు ఉన్న లడ్డూ బ్లాక్ మార్కెట్‌లో రూ.100 ధర పలికే అవకాశం ఉందని, దళారులను పెంచి పోషించడమే అవుతుందని వి.నాగరాజు, పి.మురళి, నవీన్‌కుమార్‌రెడ్డి, పాలగిరి ప్రతాప్‌రెడ్డి విమర్శించారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సాంస్కృతిక పోటీలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: స్థానిక రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఈనెల 6, 13, 20, 27వ తేదీల్లో పట్టణంలోని పదో తరగతి విద్యార్థులకు సాంస్కృతిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ క్లబ్ కార్యదర్శి సిద్ధులూరి ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ప్రైవేటు విద్యా సంస్థల్లో 10వ తరగతి చదువుతున్న అందరు విద్యార్థులు ఈ పోటీలకు అర్హులని పేర్కొన్నారు. డాన్స్, సంగీతం, రంగవల్లులు, చిత్రలేఖనం, వ్యాసరచన వక్తృత్వ పోటీల్లో విద్యార్థులు పోటీ పడొచ్చని వివరించారు. వివరాలకు 8074732500, 9440426116 నంబర్లను సంప్రదించాలని కోరారు.

కంటి వైద్యశిబిరానికి అనూహ్య స్పందన

ప్రజాశక్తి-గూడూరు టౌన్: పట్టణంలోని నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో గూడూరు ఎన్ఎస్ఎస్ యూనిట్, స్మార్ట్ విజన్ నెల్లూరు వారి సహకారంతో మెగా ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి అనూహ్య స్పందన లభించిందని నిర్వాహకులు తెలిపారు. కళాశాలలోని 200 మంది అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులకు వైద్యులు సందీప్ కంటి పరీక్షలు చేపట్టారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డి.రవిప్రసాద్, డీన్ కె.విశ్వనాథ్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ అధికారి కోటేశ్వర్రావు, ఏవో కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతరలో పాల్గొన్న ప్రముఖులు

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పట్టణంలో వైభవంగా జరుగుతున్న గంగ జాతరలో బుధవారం ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్, కోనేటి ఆదిమూలం, మాజీ మంత్రి ఆర్కె రోజా వేర్వేరుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గంగమ్మను దర్శించుకున్నారు. వారికి స్థానిక నాయకులు స్వాగతం పలికి మర్యాదలు చేశారు.

తినుబండారాలు, సబ్బులు పంపిణీ

ప్రజాశక్తి-సూళ్లూరుపేట: వాసవి క్లబ్ సూళ్లూరుపేట, వనితా క్లబ్ వారి ఆధ్వర్యంలో అంతర్జాతీయ వాసవి వారోత్సవాలలో భాగంగా బుధవారం స్థానిక బాపూజీ కాలనీలోని శ్రీ సాయి వృద్ధాశ్రమంలో వృద్ధులకు బ్రెడ్లు, బిస్కెట్ ప్యాకెట్లు, సబ్బులు వితరణగా ఇచ్చారు. సేవా కార్యక్రమంలో వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ బండారు శిరీష్, జిల్లా 205ఎ రీజియన్ టూ రీజియన్ చైర్మన్ సాయిరామ్, జోన్ చైర్మన్ సునీత, సభ్యులు గుర్రం ప్రసాద్, సెక్రటరీ సౌజన్య, వృద్ధాశ్రమం నిర్వాహకులు మస్తాన్ బాబు పాల్గొన్నారు.

కుస్తీ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



ప్రజాశక్తి-క్యాంపస్: గత నెల 25న రెండు రోజుల పాటు రేణిగుంట జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో రాష్ట్ర గ్రాప్లింగ్ సమాఖ్య ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి గ్రాప్లింగ్ రెజ్లింగ్ పోటీలు జరిగాయి. సబ్ జూనియర్, సీనియర్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన శ్రీ పద్మావతి జూనియర్ కళాశాల విద్యార్థులు రెండు విభాగాల్లో పాల్గొని 7 బంగారు, 12 కాంస్య, 16 రజత పతకాలు సాధించి జిల్లాకు ఛాంపియన్ షిప్ రావడానికి ప్రధాన కారణమయ్యారు. వీరిని బుధవారం కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ భువనేశ్వరి ప్రత్యేకంగా అభినందించారు.

పుత్తూరు డీఎస్పీకి సత్కారం

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పుత్తూరు డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన రవికుమార్‌ను మండల ముస్లిం నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. దుశ్శాలువలతో సత్కరించారు. అదేవిధంగా ఎంపిడిఓ ఓబులయ్యను కలిసి శుభాభినందనలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు జమాలాలిషా, సర్దార్, హమీద్ బాషా, చాను, రఫీ, యాసిన్ బాషా, షకీల్, సనావుల్ల, రసూల్ పాల్గొన్నారు.

సీఐలను కలిసిన నాయకులు

ప్రజాశక్తి-గూడూరు టౌన్: ఇటీవల జరిగిన బదిలీల్లో పట్టణ, రూరల్ సీఐలుగా వచ్చిన శేఖర్ బాబు, కిషోర్ బాబులను బుధవారం టీడీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని వేర్వేరుగా కలిసి శుభాభినందనలు తెలిపారు. దుశ్శాలువలతో సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు చెంచురామయ్య, ఇశ్రాయేల్, అబ్దుల్ రహీం, మస్తాన్ నాయుడు, చంద్రమౌళి, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

సీఐగా సుబ్బరామిరెడ్డి బాధ్యతలు



ప్రజాశక్తి-రామచంద్రాపురం(చంద్రగిరి): చంద్రగిరి సీఐగా బుధవారం సుబ్బరామిరెడ్డి బాధ్యతలు చేపట్టారు. నగరి రూరల్ పోలీస్ స్టేషన్ నుంచి ఆయన చంద్రగిరికి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తుండిన సీఐ రామయ్య తిరుపతి ఎస్వీయూ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. సుబ్బరామిరెడ్డి మాట్లాడుతూ చంద్రగిరిలో మాదకద్రవ్యాలు, గంజాయి, జాతీయ రహదారి ప్రమాదాలను అరికట్టే దిశగా పనిచేస్తానని తెలిపారు.

ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు తగదు

ప్రజాశక్తి-గూడూరు టౌన్: గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్‌ని విమర్శించే స్థాయి ఎమ్మెల్సీ మేరిగ మురళికి లేదని జనసేన పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షులు తీగల చంద్రశేఖర్ రావు అన్నారు. గూడూరు జనసేన పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గూడూరులో నివాసం ఉంటూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడుతున్న ఎమ్మెల్యేపై విమర్శలు తగదన్నారు. ఇకనైనా ఎమ్మెల్సీ మేరిగ మురళి నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడాలని హితవు పలికారు. సమావేశంలో మోహన్, సాయి కిరణ్, సనత్, మనోజ్ కుమార్, ఓంకార్, వంశీ, తిరుపాలు, సాయి, రమేష్ పాల్గొన్నారు.

ఇసుక కష్టాల్ని తీర్చండి

- ఇబ్బందులున్నా.. ఆ అధికారులు పట్టించుకోలేదు
- తమరైనా స్పందించండి ఎమ్మెల్యే గారూ..
- కార్మిక సంఘం నేతల వినతి



ఎమ్మెల్యేకు విన్నవిస్తున్న కార్మిక సంఘం నాయకులు

ప్రజాశక్తి-గూడూరు టౌన్: నూతన ఉచిత ఇసుక విధానం తీసుకొచ్చినా ఇప్పటికీ అందుబాటులోకి రాలేదు.. ఆర్‌డీవో కిరణ్‌ని అడిగాం.. తహశీల్దార్‌కి పలు మార్లు విన్నవించాం.. పొంతలేని సమాధానాలు చెబుతున్నారు.. మీరైనా పట్టించుకొని ఇసుకను అందుబాటులోకి తెచ్చే చర్యలు తీసుకోండి సార్.. అంటూ భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు, ప్రజా సంఘాల నాయకులు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ వద్ద మొరపెట్టుకున్నారు. బుధవారం గూడూరులో ఎమ్మెల్యేని ప్రత్యేకంగా కలిసి పరిస్థితులను వివరించారు. ఇసుక కొరత కారణంగా పనులు లేక, ఇంటి బాడుగలు కట్టలేక, పిల్లల చదివించుకోలేక నానా ఇబ్బందులకు గురవుతున్నట్లు ఎమ్మెల్యేకి విజ్ఞప్తించారు. వారి విన్నపాన్ని ఆలకించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడి ఇసుక అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు పుట్టా శంకరయ్య, రఫీ, సేలం శేఖరాచారి, పట్టణ శాఖ కార్యదర్శి జోగి శివకుమార్, సిఐటియు నాయకులు బి.వి.రమణయ్య, ఎస్.సురేష్, నాయకులు ప్రసాద్, నారాయణ, బాషా, అబ్దుల్లా మేస్త్రి, బండి కిష్టయ్య, తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో మెలగాలి

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్:

విద్యార్థులు ఐకమత్యంగా ఉంటూ క్రమశిక్షణతో చదువుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కోటేశ్వరయ్య అన్నారు. బుధవారం కళాశాలలో మొదటి సంవత్సర విద్యార్థుల పరిచయ వేదిక కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత లక్ష్యాలతో ఎదగాలన్నారు. కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. వైస్ ప్రిన్సిపల్ వీరయ్య మాట్లాడుతూ ఇండక్షన్ కార్యక్రమం (అవగాహనా కార్యక్రమం) వల్ల విద్యార్థులకు కళాశాలలో అందుబాటులో ఉన్న వసతుల గురించి అవగాహన ఏర్పడుతుందని, అధ్యాపకులతో, ఇతర విద్యార్థులతో పరిచయం, అనుబంధం ఏర్పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమం నెలరోజుల పాటు జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో సుజన, నరసింహులు, వాణిశ్రీ, పద్మావతి, నాగేశ్వరరావు, తిరుమలయ్య, రఘు, గంగయ్య, పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కోటేశ్వరయ్య

ఓపెన్ స్కూల్ అడ్మిషన్ల ప్రక్రియను వేగవంతం చేయాలి

ప్రజాశక్తి-రామచంద్రపురం(తిరుపతి రూరల్): ఓపెన్ స్కూల్ అడ్మిషన్ల ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర సార్వత్రిక విద్యాపీఠం సూపరింటెండెంట్ జెవి నాగేంద్ర రావు అన్నారు. తిరుచానూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం జిల్లాలోని ఓపెన్ స్కూల్ అధ్యయన కేంద్రాల సమన్వయ కర్తలతో అడ్మిషన్ల ప్రక్రియపై అత్యవసర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నాగేంద్ర రావు మాట్లాడుతూ అడ్మిషన్ల ప్రక్రియలో ఎలాంటి అవకతవకలకు చోటు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులను మాత్రమే వసువులు చేయాలని చెప్పారు. అధికారులు అందించిన మార్గదర్శకాలను తప్పక పాటించాలని, లేకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏ అధ్యయన కేంద్రమైనా అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తే ఆ కేంద్రాన్ని ఇనాక్టివ్ చేయాలని డైరెక్టర్ ఆదేశించినట్లు వివరించారు. లక్ష్యాన్ని చేదించడంలో అందరి కృషి అవసరమని నాగేంద్రరావు తెలిపారు. అధ్యయన కేంద్రాల పరిధిలో రెగ్యులర్ పది, ఇంటర్మీడియట్‌లో ఫెయిల్ అయి వున్న విద్యార్థుల వివరాలను సేకరించి, వారిని సంప్రదించి ఓపెన్ స్కూల్‌లో అడ్మిషన్ పొందేటట్టు కృషి చేయాలని సూచించారు. డీఈవో వి.శేఖర్ మాట్లాడుతూ ఓపెన్ స్కూల్ సర్టిఫికేట్‌ను కూడా రెగ్యులర్ పాఠశాల సర్టిఫికేట్‌లతో సమానమైనవి అన్నారు. అడ్మిషన్ల సందర్భంగా ఎలాంటి అవినీతికి తావు లేకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్, ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్, గురుస్వామి రెడ్డి పలువురు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో శేఖర్

పనిలో నాణ్యతను బట్టే ఫలితాలు

ప్రజాశక్తి -రేణిగుంట: చేసే పనిలో నాణ్యతను బట్టే ఫలితాలు ఉంటాయని ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ ఎన్. బి. సుధాకర్ రెడ్డి చెప్పారు. బుధవారం తిరుపతి రాస్ ప్రధాన కార్యాలయంలో ఉద్యోగులకు భగవద్గీత శ్లోకాల్లో మానసిక కోణాలపై అవగాహన కల్పించారు. సామర్థ్యం, జ్ఞానం, చురుకుదనం, నైపుణ్యం ఉన్న వారికి ఉత్తమ ఫలితాలు చేకూరుతాయని, వత్తి నైపుణ్యాలతో పాటు సామాజిక, ఆర్థిక, రాజకీయ, ఆధ్యాత్మిక వికాసం అవసరం అన్నారు. ప్రతికూల భావాలు, సామర్థ్య లోపాలు ఒత్తిళ్లకు మూలాలుగా మారుతాయన్నారు. సానుకూల దకృథం, సమతుల్య ఆహారం, జీవన నైపుణ్యాలు, సంతప్తి మనో శక్తికి మూలం అన్నారు. ప్రాజెక్టు డైరెక్టర్ వి.నాగరాజు, అధికారులు బాలాజీ రెడ్డి, రవి, నాగేశ్వరరావు, వికాస నిపుణుడు చంద్రమౌళి, ప్రభాకర్ శెట్టి పాల్గొన్నారు.



అవ్వతాతలకు భరోసాగా పురిని కృష్ణ



ప్రజాశక్తి- సూళ్లూరుపేట: మున్సిపాలిటీ పరిధిలోని మన్నారు పోలూరులో పనిచేసే సంక్షేమ కార్యదర్శి పురిని కృష్ణ పేరు అంటేనే అనారోగ్యంగా బాధపడుతున్న అవాతాతలకు ఓ భరోసా. పింఛన్ సమయములో ఎవరైనా అనారోగ్య కారణాల వలన ఎక్కడైనా ఎంత దూరమైనా హాస్పిటల్లో ఉంటే తన సొంత ఖర్చులతో వెళ్లి పింఛన్ అందజేస్తారు. గతంలో తిరుపతికి వెళ్లి ఒక వద్ధుడికి పింఛన్, నెల్లూరుకు వెళ్లి ఒక వద్ధురాలికి అందజేశారు. ఈ నెలకు సంబంధించిన పింఛన్ చెన్నై లోని రాజీవ్ గాంధీ గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ నందు బుధవారం అందజేశారు. మన్నారు పోలూరు న్యూ కాలనీ సచివాలయ పరిధిలో నివాసం ఉంటున్న గాలి ఆనందయ్యకు ఆగస్టు 24న బైక్ యాక్సిడెంట్ జరిగి మోకాలుకు శస్త్ర చికిత్స జరిగింది. చెన్నయ్ గవర్నమెంట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న సచివాలయ సంక్షేమ కార్యదర్శి పురిని కృష్ణయ్య చెన్నయ్‌కు వెళ్లి పింఛన్ అందజేసి పరామర్శించారు.

చెంబేడులో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్

తిరుపతి : స్విమ్స్, శ్రీ బాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని చెంబేడు పిహెచ్ సి వైద్యాధికారి డాక్టర్ చంద్రమోహన్ రెడ్డి కోరారు. చెంబేడు పిహెచ్ సి పరిధిలోని కానూరులో గల ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. 6న బంగారంపేట విలేజ్ హెల్త్ సెంటర్ లో మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపు జరుగనుంది. ఈ కార్యక్రమంలో స్విమ్స్ శ్రీ బాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పద్మావతి, సర్పంచ్ రత్నమ్మ, పంచాయతీ కార్యదర్శి శ్రీధర్ పాల్గొన్నారు.

చవితి ఏర్పాట్లపై సమీక్ష

ప్రజాశక్తి-తిరుపతి టౌన్:

వినాయక చవితి వేడుకలకు ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని అదనపు కమిషనర్ చరణ్ తేజ్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య తెలిపారు. బుధవారం సాయంత్రం స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ హాలు నందు వినాయక ఉత్సవ నిర్వహణ, కార్యక్రమం మహోత్సవానికి చేయవలసిన ఏర్పాట్ల పై శ్రీ వరసిద్ధ వినాయక మహోత్సవ కమిటీ నిర్వాహకులు, తదితరులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్, తిరుపతి ఆర్ డి ఓ నిశాంత్ రెడ్డి, డి. ఎస్. పి. రామకష్ణ ఆచారి పాల్గొన్నారు.

శ్రీవారి లడ్డూలకు నందిని నెయ్యి కొనుగోలు : ఈవో

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో: శ్రీవారి లడ్డూలు మరింత రుచికరంగా ఉండేందుకు కర్నాటక కోఆపరేటివ్ మిల్క్ ప్రొడ్యూసర్స్ ఫెడరేషన్ లిమిటెడ్ నుంచి నందిని నెయ్యి కొనుగోలు చేస్తున్నట్లు టిటిడి ఈవో జె.శ్యామలరావు చెప్పారు. బుధవారం తిరుపతి అలిపిరి వద్ద నెయ్యి లారీకి పూజలు చేసి తిరుమలకు పంపారు. ఈ సందర్భంగా జె.శ్యామలరావు మాట్లాడుతూ లడ్డూ నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. నెయ్యి నాణ్యత, రుచిని మెరుగుపరచడానికి టెండర్ షరతులను సవరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, జేఈఓ గౌతమి, సివిఎస్వో శ్రీధర్, డిప్యూటీ ఈవో పద్మావతి, నందిని డెయిరీ లైజనింగ్ ఆఫీసర్ మల్లికార్జున్ రెడ్డి పాల్గొన్నారు.

ధర్మగిరి వేద విజ్ఞాన పీఠం తనిఖీ

ప్రజాశక్తి-తిరుపతి సిటి : తిరుమలలోని ధర్మగిరి వేద విజ్ఞాన పీఠాన్ని బుధవారం సాయంత్రం టీటీడీ అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి పరిశీలించారు. అందులో భాగంగా వేద విజ్ఞాన పీఠంలో వేద విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించి, టిటిడి కల్పిస్తున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. సిఈ సత్యనారాయణ, ధర్మగిరి ప్రిన్సిపల్ అవధాని, విజిఓ రాంకుమార్ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉండొచ్చునని ఐసిడిఎస్ సూపర్వైజర్ శిల్ప అన్నారు. మండలంలోని ఆలత్తూరు అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పౌష్టికాహారం మాసోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెలాఖరు వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో పంపిణీ చేసే పౌష్టికాహారాన్ని గర్భవతులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం కుసుమకుమారి, చెంచులక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

గూడూరు టౌన్: పట్టణంలోని వెలుగు కార్యాలయంలో పోషకాహార మాసోత్సవాలు ఘనంగా జరిగాయి. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పట్టణం, గ్రామీణ మండలానికి సంబందించిన గర్భవతులకు ఘనంగా సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మెహబూబి మాట్లాడుతూ.. గర్భవతులు పౌష్టికాహారం తీసుకుంటే తల్లీ బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని సూచించారు. కార్యక్రమంలో సహాయ సీడీపీవో జ్యోతి కిరణ్, బుజ్జమ్మ, స్వరూపా రాణి, చెంచులక్ష్మి, హైమావతి, రేణుక, శివజ్యోతి పాల్గొన్నారు.

తిరుపతి డెస్క్: ఏర్పేడులోని సీతారాంపేట అంగన్వాడి సెంటర్లలో పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. టిడిపి మహిళా అధ్యక్షురాలు గాలి కృష్ణవేణి, ఏర్పేడు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయిని శోభారాణిలు హాజరయ్యారు. కార్యక్రమం గురించి ఐసిడిఎస్ సూపర్వైజర్ భారతి వివరించారు.



గూడూరులో..

అనారోగ్య బాధితునికి చేయూత

ప్రజాశక్తి-గూడూరు టౌన్: పట్టణంలోని అశోక్ నగర్‌కి చెందిన బత్తల రాజా అనే యువకుడు అనారోగ్యానికి గురైయ్యారు. విషయం తెలుసుకున్న రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ రాజనేని శ్రీనివాసులు నాయుడు ఆదేశాల మేరకు ట్రస్ట్ సభ్యులు రూ.పదివేల ఆర్థిక సాయాన్ని బాధితుడి కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు అమరయ్య నాయుడు, బాబు, భాస్కర్ పాల్గొన్నారు.

అంతర పంటలపై దృష్టి సారించండి



పంటలను పరిశీలిస్తున్న హెచ్‌వో శైలజ

ప్రజాశక్తి-రామచంద్రపురం(చంద్రగిరి): రైతులు అంతర పంటల సాగుపై దృష్టి పెట్టాలని ఉద్యానశాఖ అధికారి ఎస్.శైలజ అన్నారు. మండలంలోని దోర్నకంబాల పంచాయితీలోని కూరగాయ తోటలను బుధవారం పరిశీలించారు. అక్కడ రైతులకు పలు సూచనలు ఇచ్చారు. కూరగాయలు, పూలతోటల పెంపకం గురించి అవగాహన కల్పించారు. డ్రిప్ పద్ధతిలో పంటలు సాగు చేయడం వల్ల లాభాలను వివరించారు. కార్యక్రమంలో మైక్రో ఇరిగేషన్ ఏరియా ఆఫీసర్ తులసి, రైతులు పాల్గొన్నారు.

సమిష్టి కృషితో అభివృద్ధికి బాటలు వేద్దాం

- మండల మీట్‌లో ఎమ్మెల్యే ఆదిమూలం పిలుపు

ప్రజాశక్తి-పిచ్చాటూరు: సమిష్టి కృషితో మండల అభివృద్ధికి బాటలు వేద్దామని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పిలుపునిచ్చారు. బుధవారం నాగలాపురం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఎమ్మెల్యే హాజరై ప్రసంగించారు. ప్రజాప్రతినిధులు, అధికారులందరి సమన్వయంతో అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. టిపి కోట రోడ్డు నిర్మాణ ప్రతిపాదనను ఇప్పటికే సీఎంకు, మంత్రులకు దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన స్పష్టం చేశారు. నిధులు మంజూరు చేయడానికి కృషి చేస్తానన్నారు. నాగలాపురం, సత్యవేడు, నారాయణవనం తహశీల్దార్ కార్యాలయాల నూతన భవనాల నిర్మాణాలు చేపట్టనున్నట్లు చెప్పారు. మండలంలోని ద్వారకా నగర్, గొడ్డేరు వాగు కాజ్‌వే పనులకు త్వరలో ప్రభుత్వం టెండర్లు పిలిచి పనులు చేపడతామన్నారు. అంతకు ముందు నాగలాపురంలో నూతనంగా నిర్మించిన పంచాయతీ షాపింగ్ కాంప్లెక్స్ భవనాన్ని ప్రారంభించారు.

పరామర్శ



హెన్రీ భాస్కర్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: గేట్ పుత్తూరుకి చెందిన విశ్రాంత ఎంఈవో హెన్రీ భాస్కర్ కుటుంబ సభ్యులను బుధవారం మాజీ మంత్రి ఆర్‌కె రోజా పరామర్శించారు. హెన్రీ భాస్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన అందించిన సేవలను కొనియాడారు. కుటుంబ సభ్యులకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు హరి, జయప్రకాష్, భానుమతి, చక్రి, ఉమామహేశ్వర్, మునయ్య, భాస్కర్, ప్రవీణ్ పాల్గొన్నారు.

హమ్మయ్య.. బస్సొచ్చేసింది.!

- వరదయ్యపాళ్యం టు సూళ్లూరుపేట సర్వీసు ఏర్పాటు

ప్రజాశక్తి-వరదయ్యపాళ్యం: ఆ పల్లెల నుంచి నిత్యం రోజువారి అవసరాల నిమిత్తం వరదయ్యపాళ్యం, సూళ్లూరుపేట పట్టణాలకు అక్కడి ప్రజలు రాకపోకలు సాగిస్తుండేవారు. అప్పటి వరకూ ఉన్న బస్సులను వివిధ కారణాల చేత సర్వీసును ఆర్టీసి అధికారులు నిలిపి వేశారు. వరదయ్యపాళ్యం – సూళ్లూరుపేట పల్లెల దారిలో నిరుపేదలు ఆ మార్గం గుండా నిత్యం ప్రైవేటు వాహనాలు, ఆటోలు, రకరకాల ఇబ్బందులు పడి పట్టణాలకు చేరుకొనే వారు. ప్రజల ఇబ్బందులను చూసిన అంబూరు గ్రామానికి చెందిన ఆణిముత్యం నందకిషోర్ స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఆర్టీసీ అధికారులతో సంప్రదించిన ఎమ్మెల్యే వరదయ్యపాళ్యం నుంచి సంత వేలూరు మీదుగా సూళ్లూరుపేటకు బస్సు సర్వీసును ఏర్పాటు చేయించారు. కాగా ఆ సర్వీసును బుధవారం ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించారు. దీంతో అక్కడి పల్లె ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎట్టకేలకు ఊళ్లకు బస్సొచ్చిందని సంబరపడుతున్నారు.



బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

'బొజ్జల కుటుంబంపై చౌకబారు విమర్శలు తగదు'

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి కుటుంబానిది సంక్షేమ పాలననీ, మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డిదే కుటుంబ పాలనని టీడీపీ నేతలు విజయ్ కుమార్ నాయుడు, రంగినేని చెంచయ్య నాయుడు, చెలికం పాపిరెడ్డి, కామేష్ యాదవ్, సుబ్బయ్యలు అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు వేరువేరుగా మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన మూడు నెలల్లోనే ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి అనేక మంచి కార్యక్రమాలు చేపట్టారని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే బియ్యపు మసూద్ రెడ్డి తన సతీమణి శ్రీవాణి రెడ్డి, కుమార్తె పవిత్ర రెడ్డి, కుమారుడు ఆకాష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సోదరుడు కిషోర్ రెడ్డి చివరకు అత్త మామలు కూడా ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొంటూ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారని గుర్తు చేశారు. అంతేకాకుండా వైసిపి కార్యాలయంలో ఇంటి పట్టాలు ఇచ్చిన ఘనత వైసీపీదేనని దుయ్యపట్టారు. అలా వైసీపీ నాయకులు కుటుంబ పాలన చేశారని ఎద్దేవా చేశారు. ప్రజల్లో ఎమ్మెల్యేకి వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక కొంతమంది గిట్టని వారు ఎమ్మెల్యే ది కుటుంబ పాలన అంటూ చౌకబారు విమర్శలు చేయడం తగదన్నారు. మిన్నల్ రవి, కాసరం రమేష్, ఢిల్లీ, విజయ్ కుమార్, కోబాకు లక్ష్మణ్, షఫీ, జిలానీ బాషా తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

విశ్వవిద్యాలయాల సంస్థాగత అభివృద్ధి ప్రణాళిక కార్యశాలలో పాల్గొన్న వీసీ

ప్రజాశక్తి-క్యాంపస్: జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం వీసీ ప్రొ.జి.ఎస్.ఆర్ కృష్ణమూర్తి యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్, మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో ఇండియన్ నేషనల్ అకాడమీలో నిర్వహించిన విశ్వవిద్యాలయాల సంస్థాగత అభివృద్ధి, ప్రణాళిక అనే కార్యశాలలో హాజరయ్యారు. ఈ సందర్భంగా వి.సి ప్రొ.జి.ఎస్.ఆర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం జరుగుతున్న పనులు వాటి యొక్క పురోగతి అంశాలపైన ఆయన వివరించారు.



ముళ్ళ పొదల్లో గుర్తు తెలియని మహిళ మృతదేహం

ప్రజాశక్తి-దొరవారిసత్రం: మండల పరిధిలోని కలకత్తా– చెన్నై రహదారికి సమీపంలో ఉన్న ఓటిగుంట చెరువు ముళ్ళ పొదల్లో బుధవారం పశువుల కాపరులు గుర్తు తెలియని మృతదేహాన్ని గుర్తించారు. ఈ సమాచారాన్ని పోలీసులకు అందించారు. శవమై పడి ఉన్న మహిళకు సుమారు 37సంవత్సరాల వయస్సు ఉంటుందని అంచనా. ఆమె శరీరం కుళ్ళిన దుర్గంధపు వాసనను బట్టి చూస్తే చనిపోయి మూడు రోజులు పైబడి ఉంటుందని పోలీసులు అంచనా వేశారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ శ్రీనివాసులు రెడ్డి, సీఐ సంగమేశ్వర రావు, ఎస్ఐ అజయ్ కుమార్‌లకు సమాచారం ఇవ్వడంతో వెంటనే ఘటనా స్థలాన్ని పరిశీలించారు. చనిపోయిన మహిళ శరీరంపై నల్ల రంగు గుడ్డ చుట్టి ఉన్నట్లు గుర్తించారు. ఈ సంఘటనపై ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇది హత్య.. ఆత్మహత్య.. బయట ప్రాంతంలో ప్రాణం తీసి అక్కడ ముళ్ళపదల్లో పడవేశారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ఎర్రచందనం స్వాధీనం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): సత్యవేడు అటవీ ప్రాంతంలో ఎర్రచందనం తరలిస్తుండగా స్మగ్లర్లను అరెస్ట్ చేసినట్లు బుధవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు. ఆర్ఎస్ఐ మురళీధర్ రెడ్డి బృందం మంగళవారం సత్యవేడు బీరకుప్పం సెక్షన్ ఎస్‌కె మడుగు వద్ద కూంబింగ్ చేపట్టారని చెప్పారు. బుధవారం ఉదయం భూపతేశ్వరకోన వద్ద కొందరు ఎర్రచందనం దుంగలను మోసుకుని వస్తూ కనిపించారని, దుంగలు పడేసి పారిపోతుండగా దాడి చేసి ఇద్దరు స్మగ్లర్లను అదుపులోకి తీసుకున్నట్లు వివరించారు. సంఘటనా స్థలంలో 19దుంగలు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఆ మేరకు ఎస్ఐ సిహెచ్ రఫి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



హ్మా.. పిల్లలూ.. ఎలా ఉంది భోజనం.!

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: హ్మా.. ఏంటి పిల్లలూ.. భోజనం రుచి ఎలా ఉంది.. రోజూ మెనూ ప్రకారం భోజనం వడ్డిస్తున్నారా.. అంటూ ఎంఈవో–2 సుబ్రమణ్యం పాఠశాల విద్యార్థులను ఆరాదీశారు. మండలంలోని నిరీనికండ్రిగ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. పిల్లలతో కలసి భోజనం చేశారు. ఈ సందర్భంగా రుచి, మెనూ ప్రకారం భోజనం వడ్డిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. నాణ్యతపై అక్కడి హెచ్‌ఎం లీలా ప్రసాద్‌కు పలు సూచనలు ఇచ్చారు. అంతకు ముందు కుంభాకం పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులు స్మార్ట్ టీవీలో ప్రశ్నాపత్నాలు రాస్తుండడంతో వాటిని పరిశీలించి అక్షరాలు బాగా ఉన్నాయని అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కోదండరాం పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి భోజనం తింటున్న ఎంఈవో

22న తిరుపతి నుంచి విశాఖకు రథయాత్ర

తిరుపతి సిటి :

తిరుచానూరు లోని శ్రీ ఆదివరాహి శక్తి టెంపుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో.. ఈ నెల 22వ తేదీ తిరుపతి నుండి 28వ తేదీ విశాఖపట్నం వరకు శ్రీవారాహి మహా రథయాత్ర కొనసాగుతుందని.. టిడిపి రాష్ట్ర నాయకులు మబ్బు దేవ నారాయణ రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివరాహిశక్తి రాష్ట్ర అధ్యక్షులు మహా రుద్ర వారహి స్వామి , శివశంకర్ ప్రసాద్ , శ్రీరాములు తదితరులతో కలిసి మబ్బు దేవనారాయణ రెడ్డి మాట్లాడుతూ.. మన రాష్ట్రంలో ప్రకతి వైపరీత్యాలుతో జరుగుతున్న నష్టాల్ని ఆధ్యాత్మికంగా ఆపడానికి... ఈ రథయాత్రను జరుపుతున్నట్లు తెలియజేశారు.

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి: ఎమ్మెల్యే

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: ఈ నెల 6న సత్యవేడులో నిర్వహించబోయే జాబ్ మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకొని ఉద్యోగాలు పొందాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సూచించారు. బుధవారం మెగా జాబ్ మేళాకు సంబంధించిన పోస్టర్‌ను ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆవిష్కరించారు. శ్రీసిటీ, చెన్నైలోని పది బహుళ జాతీయ కంపెనీలు 500లకు పైగా ఉద్యోగాలు కల్పించేందుకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఆర్. లోకనాథం తెలిపారు. పది, ఐటిఐ, ఇంటర్, డిప్లొమా, ఏదైనా డిగ్రీ, పీజీ పూర్తి చేసుకున్న వారికి సదవకాశం అన్నారు. నిరుద్యోగులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆసక్తి ఉన్న వారు ముందుగా రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. వివరాల కోసం 9440374535, 9491458910 నెంబర్లకు సంప్రదించాలని కోరారు.